
సాక్షి విశాఖపట్నం

సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025



న్యూస్‌రీల్

పోలీస్ కమిషనరేట్‌కు స్కోచ్ అవార్డు


పోలీస్ కమిషనరేట్‌కు వచ్చిన స్కోచ్ అవార్డు

అల్లిపురం: రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం అందించే ప్రత్యేక కేంద్రానికి ప్రతిష్టాత్మకమైన స్కోచ్ అవార్డు లభించినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్లుగా విశాఖ పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు చేసిన ఈ సహాయ కేంద్రం ద్వారా, 69 రోడ్డు ప్రమాద కేసులలో బాధితులకు రూ. 63.50 లక్షల పరిహారం అందించారు. ఈ సేవా కార్యక్రమానికి గుర్తింపుగా ఢిల్లీలో జరిగిన 102వ స్కోచ్ అవార్డుల ప్రదానోత్సవంలో విశాఖ పోలీసులు ఈ అవార్డును స్వీకరించారు. ఈ విజయంతో హిట్ అండ్ రన్ కేసుల బాధితులు, వారి కుటుంబ సభ్యులు, నగర పోలీసు అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ఇటువంటి సేవా కేంద్రం ఏర్పాటు చేసినందుకు గాను కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు విశాఖకు ముఖ్యమంత్రి

మహారాణిపేట: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సోమవారం విశాఖ రానున్నారు. ఉదయం 9.30 గంటలకు విశాఖ చేరుకుంటారు. 9.45 గంటలకు 28వ జాతీయ ఈ గవర్నెన్స్ జాతీయ సదస్సులో పాల్గొంటారు. ముందుగా ఈ గవర్నెన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారు. అనంతరం 12 గంటలకు విజయవాడ తిరిగి వెళతారు.

కేంద్రమంత్రి కూడా...

కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సోమవారం విశాఖ రానున్నారు. ఆయన ఢిల్లీ నుంచి విమానంలో మధ్యాహ్నం 1.55 గంటలకు విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి నొవోటెల్ హోటల్‌కు వెళ్లి, మధ్యాహ్నం 3 గంటల నుంచి 4:30 గంటల వరకు జరిగే ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సులో పాల్గొంటారు. సదస్సు అనంతరం సాయంత్రం 6.15 గంటలకు తిరిగి విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళ్తారు.

సంపత్ వినాయగర్‌ను దర్శించుకున్న వైస్ అడ్మిరల్


శ్రీనివాసరావుకు స్వామి ఫొటో అందజేస్తున్న ఈవో ప్రసాదరావు

మహారాణిపేట: నావికదళం సౌత్ జోన్ కొచ్చి వైస్ అడ్మిరల్ వి. శ్రీనివాసరావు ఆదివారం తన కుటుంబంతో కలిసి ఆశీల్‌మెట్టలోని శ్రీ సంపత్ వినాయగర్ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి హోమం, పంచామృత అభిషేకం, ఇతర సేవలలో ఆయన పాల్గొన్నారు. పూజలనంతరం ఆలయ ఈఓ ప్రసాదరావు, స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, అలంకరణ ఫొటోను వైస్ అడ్మిరల్‌కు అందజేశారు.

నేడు కలెక్టరేట్, జీవీఎంసీలలో పీజీఆర్ఎస్ రద్దు

మహారాణిపేట/దాబాగార్డెన్స్: కలెక్టరేట్, జీవీఎంసీలో సోమవారం సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం (పీజీఆర్ఎస్) తాత్కాలికంగా రద్దు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నగరంలో నిర్వహిస్తున్న జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సులో పాల్గొంటున్నందున, అధికారులు ఆ ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారని కలెక్టర్ హరేందిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

బీచ్‌రోడ్డులో పారిశుధ్యం మెరుగు

దాబాగార్డెన్స్: బీచ్‌రోడ్డులో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ప్రజా ఆరోగ్య అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆర్కేబీచ్‌లోని కాళీమాత గుడి వద్ద ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, ఇతర అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బీచ్‌రోడ్డులో ఉన్న దుకాణాలు, ఫుడ్‌కోర్టుల వద్ద చెత్త వేయడానికి డస్ట్‌బిన్‌లు ఉండేలా చూడాలని, వ్యాపారులు తమకు కేటాయించిన స్థలంలోనే వ్యాపారం నిర్వహించేలా పర్యవేక్షించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి చెత్తను బహిరంగంగా వేసినా, కేటాయించిన పరిధి దాటి వ్యాపారం చేసినా మొదటిసారి రూ. 1,000 జరిమానా విధించాలని, అదే తప్పు మళ్లీ చేస్తే ఆ దుకాణాన్ని వెంటనే తొలగించాలని ఆదేశించారు.

శరన్నవరాత్రుల కోలాహలం





సోమవారం నుంచి ప్రారంభం కానున్న దేవీ శరన్నవరాత్రుల కోసం విశాఖలో సందడి నెలకొంది. దుర్గాదేవి విగ్రహాలు మండపాలు, ఇళ్లకు తరలిపోతున్నాయి. ఆదివారం సాయంత్రం నుంచి భక్తులు, కమిటీ సభ్యులు తాము ఆర్డర్ చేసిన విగ్రహాలను తీసుకెళ్లేందుకు ఉత్సాహంగా కనిపించారు. విగ్రహాల తయారీదారులు, కొనుగోలుదారులు కూడా దుర్గాదేవిని వివిధ అలంకరణలతో ముస్తాబు చేస్తూ కనిపించారు.
-ఫొటోలు :సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్యూట్ వాక్





ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ డిజైన్ ఆధ్వర్యంలో స్థానిక విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన ఫ్యాషన్, ఇంటీరియర్, ఫొటోగ్రఫీ ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. అద్భుతంగా రూపొందించిన డిజైన్‌లు, సృజనాత్మకమైన ఫొటోలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ డిజైన్ విద్యార్థులు డిజైన్ చేసిన వస్త్రాలను ధరించి ర్యాంప్‌పై చేసిన వాక్ అందరినీ కట్టిపడేసింది. ఈ ప్రదర్శన ఇంటీరియర్ డిజైన్, ఫొటోగ్రఫీ రంగంలో రాణించాలనుకునే యువతకు ఒక చక్కటి వేదికగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శనను ప్రతి ఏడాది నిర్వహిస్తున్నామని, దీని ద్వారా విద్యార్థుల ప్రతిభకు విస్తృత ప్రచారం కల్పించి, గుర్తింపు లభించేలా కృషి చేస్తున్నామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హేమసుందర్ టింకా తెలిపారు. – సీతంపేట

విశాఖ స్వరూపం మారుతుందా?

- పెందుర్తి అసెంబ్లీ పూర్తిగా విశాఖలో ఉంచాలనే ప్రతిపాదన
- విశాఖ ఎంపీ పరిధిలోని ఎస్.కోటనీ విలీనం చేసేందుకు సన్నాహాలు
- ప్రస్తుతం విశాఖ. అనకాపల్లి జిల్లాల్లో పెందుర్తి నియోజకవర్గం
- నియోజకవర్గం మొత్తం విశాఖ జిల్లాలో కలపాలని కూటమి నేతల విజ్ఞప్తులు
- త్వరలో మంత్రివర్గ ఉప సంఘం ముందు ప్రతిపాదనలు



జిల్లా పునర్విభజన కమిటీ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కొత్త జిల్లాల ఏర్పాటు జరిగింది. వాటిలో కొన్నింటిని సవరించడానికి కూటమి ప్రభుత్వం ఒక మంత్రి వర్గ ఉప సంఘాన్ని నియమించింది. జిల్లాల సంఖ్యను పెంచడానికి కూడా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేల నుంచి వచ్చిన ప్రతిపాదనలను కూడా ఈ ఉప సంఘం పరిశీలిస్తోంది. జిల్లాల విలీనం, తొలగింపు వంటి అంశాలను ఈ కమిటీ అధ్యయనం చేస్తోంది.

మహారాణిపేట: జిల్లా సరిహద్దుల మార్పుపై ఊహాగానాలు పెరుగుతున్నాయి. పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గాన్ని పూర్తిగా, ఎస్.కోట అసెంబ్లీని పాక్షికంగా విశాఖ జిల్లాలో విలీనం చేసే ప్రతిపాదనలపై చర్చ జోరుగా సాగుతోంది. ప్రస్తుతం జిల్లాలో జీవీఎంసీ పరిధి 89శాతం ఉండగా, గ్రామీణ ప్రాంతం కేవలం 11 శాతం మాత్రమే ఉంది. ఈ గ్రామీణ ప్రాంతాన్ని పెంచడం, అలాగే అవకాశం ఉన్న ప్రాంతాలను జీవీఎంసీలో విలీనం చేయడం వంటి ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి.

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి పునర్విభజన అంశాలను తీసుకువచ్చారు. పెందుర్తి నియోజకవర్గంలోని పెందుర్తి మండలం ఇప్పటికే విశాఖ జిల్లాలో ఉండగా, అదే నియోజకవర్గంలోని సబ్బవరం, పరవాడ మండలాలను కూడా విశాఖ జిల్లాలో విలీనం చేయాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై పరిశీలన చేయాల్సిందిగా ముఖ్యమంత్రి కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గంలో ఎస్.కోట

విశాఖ పార్లమెంట్ పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు విశాఖ జిల్లాలో ఉన్నాయి. విశాఖ తూర్పు, విశాఖ ఉత్తరం, విశాఖ దక్షిణం, విశాఖ పశ్చిమం, భీమిలి, గాజువాక. అయితే ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గం మాత్రం విజయనగరం జిల్లాలో ఉంది. ఈ పరిస్థితి వల్ల ప్రజల పరామర్శలు, పర్యటనలు, ఇతర కార్యకలాపాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పార్లమెంట్ సభ్యులు భావిస్తున్నారు. అందుకే ఎస్.కోటను విశాఖ జిల్లాలో విలీనం చేయడంపై అధ్యయనం జరుగుతోంది. ఒకే ఎంపీ పరిధిలోని అన్ని నియోజకవర్గాలు ఒకే జిల్లాలో ఉంటే ఎలా ఉంటుందనే దానిపై వివిధ శాఖల అధికారుల అభిప్రాయాలను కూడా సేకరిస్తున్నారు.

జిల్లా భౌగోళిక స్వరూపంలో మార్పులు

ఒకప్పుడు పెద్ద జిల్లాగా ఉన్న విశాఖ ఇప్పుడు చిన్నగా మారింది. గతంలో మైదాన, గిరిజన, పట్టణ ప్రాంతాలు విశాఖ జిల్లాలో భాగంగా ఉండేవి. జిల్లాల విభజన తర్వాత గ్రామీణ ప్రాంతం తగ్గి, గిరిజన ప్రాంతం పూర్తిగా లేకుండా పోయింది. గ్రామీణ ప్రాంతాలు తక్కువగా ఉన్న విశాఖ జిల్లాలో అదనపు ప్రాంతాలను కలిపితే ఎలా ఉంటుందనే దానిపై అధికార యంత్రాంగం పరిశీలిస్తోంది. ఈ చర్చలు విశాఖ జిల్లా భౌగోళిక స్వరూపాన్ని పూర్తిగా మార్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇందులో భాగంగా, కొన్ని ప్రాంతాలను ఆయా జిల్లాల్లో కలపడానికి కసరత్తు జరుగుతోంది.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి


వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజును సత్కరిస్తున్న ఎస్సీ విభాగం నాయకులు అల్లంపల్లి రాజబాబు, విక్టర్ జోసెఫ్, చిత్రంలో తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

మహారాణిపేట: పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు పిలుపునిచ్చారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీల్లో పలువురికి అవకాశం కల్పించారు. రాష్ట్ర ఎస్సీ విభాగం ప్రత్యేక అధికార ప్రతినిధిగా అల్లంపల్లి రాజబాబు, రాష్ట్ర ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శిగా జి. విక్టర్ జోసెఫ్‌లు నియమితులయ్యారు. ఈ మేరకు వారిని జిల్లా పార్టీ అధ్యక్షుడు కేకే రాజు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అభినందించారు. ఈమేరకు వీరంతా మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ సమన్వయంతో పార్టీని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార విభాగం అధ్యక్షుడు పేర్ల విజయచందర్, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి పోలగం శ్రీనివాసరెడ్డి, వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం, ఎస్సీ విభాగం నాయకులు అల్లంపల్లి రాజబాబు, విక్టర్ జోసెఫ్‌లు కేకే రాజును సత్కరించారు.

5వ రోజు 717 బడ్డీలు, దుకాణాల తొలగింపు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో రోడ్లు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపునకు చేపట్టిన 'ఆపరేషన్ లంగ్స్' కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగిందని చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు తెలిపారు. నాలుగు రోజులుగా 1,759 బడ్డీలు, దుకాణాలు తొలగించగా, ఆదివారం ఒక్కరోజే 717 తొలగించారు. దీంతో ఇప్పటివరకు మొత్తం 2,476 ఆక్రమణలను తొలగించినట్లు సీసీపీ ప్రభాకరరావు తెలిపారు.

జోన్ల వారీగా తొలగించినవి..

జోన్-1: తగరపువలస మెయిన్‌రోడ్డు, ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద 12 దుకాణాలు, బడ్డీలు

జోన్-2: జాతీయ రహదారి-16 మిథిలాపురి నుంచి ఐటీ జంక్షన్ వరకు 25, కొమ్మాది జంక్షన్ నుంచి అంజలి అండ్ గీతాంజలి అపార్ట్‌మెంట్ వరకు 68, చినగదిలి జంక్షన్ నుంచి తోటగరువు జంక్షన్ వరకు 12

జోన్-3: ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి హనుమంతువాక జంక్షన్ వరకు 56

జోన్-4: లీలా మహల్ జంక్షన్ నుంచి జగదాంబ జంక్షన్ వరకు 24, జడ్జి కోర్టు నుంచి క్లాక్ టవర్ వరకు 17

జోన్-5: డీఆర్ఎం కార్యాలయం నుంచి దొండపర్తి జంక్షన్

(మిగతా IIలో)

సమన్వయంతో ఈ-గవర్నెన్స్ సదస్సు విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న రాష్ట్ర ఐటీ సెక్రటరీ కాటమనేని భాస్కర్

మహారాణిపేట: 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సును విజయవంతం చేయడానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ సరితా చౌహాన్, రాష్ట్ర ఐటీ సెక్రటరీ కాటమనేని భాస్కర్ సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్‌లతో కలిసి వారు సమీక్షా సమావేశం నిర్వహించారు.

సోమవారం, మంగళవారం నోవాటెల్ హోటల్‌లో జరగనున్న ఈ సదస్సు నిర్వహణపై కేంద్ర, రాష్ట్ర, జిల్లా అధికారులతో వారు చర్చించారు. సదస్సు ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని, ప్రతి పనినీ ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభంగా ఉండేందుకు ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయాలని, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక వెబ్ లింక్ అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అలాగే, లైజన్ అధికారులు ఎయిర్‌పోర్ట్, రైల్వే స్టేషన్ల నుండి వచ్చే అతిథులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి ఈ ప్రతిష్టాత్మక సదస్సును విజయవంతం చేయాలని వారు కోరారు.

వైఎస్సార్‌సీపీ జెండా తొలగింపుపై ఆందోళన



ఆరిలోవ ప్రాంతంలో ఆదివారం జీవీఎంసీ సిబ్బంది వైఎస్సార్‌సీపీ జెండా తొలగించడం ఉద్రిక్తతకు దారితీసింది. జీవీఎంసీ సిబ్బంది అత్యుత్సాహం వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఆగ్రహం తెప్పించింది. స్థానిక టీడీపీ నాయకుల కనుసైగలతో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ మహేష్ రోడ్డు పక్కన బడ్డీల తొలగింపు ఆదేశాలను పక్కన పెట్టి, వారి మెప్పు కోసం 13వ వార్డు పరిధి ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద ఎవ్వరికీ ఎలాంటి ఆటంకం లేని, ఐదేళ్ల నుంచి ఉన్న పార్టీ జెండాను జేసీబీతో పూర్తిగా జెండా దిమ్మతో సహా తొలగించారు.

విద్యుత్ లోపాలకు AIతో చెక్

- ఈపీడీసీఎల్ వినూత్న ఆలోచనలు
- సాంకేతికత దన్నుతో విద్యుత్ వ్యవస్థలో లోపాల సవరణ
- ఇప్పటికే ఫ్రంట్ లైన్ కార్యకలాపాల్లో ఏఐ వినియోగం
- విద్యుత్ స్తంభాల్లో లోపాల్ని స్మార్ట్‌ఫోన్ కెమేరాతో పసిగట్టేలా వ్యవస్థ
- విద్యుత్ డిమాండ్‌ని ఇట్టే పసిగట్టే ఏఐ సాంకేతికత


సీఎండీ పృథ్వీతేజ్ సమక్షంలో ఏఐ వ్యవస్థని ఈపీడీసీఎల్‌కు అందిస్తున్న జోనాయిక్ స్టార్టప్ సంస్థ ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం : విద్యుత్ వ్యవస్థలో సమస్యలను వేగంగా పరిష్కరించడానికి, ఏపీఈపీడీసీఎల్ సరికొత్త ఆవిష్కరణలను చేపడుతోంది. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ, విద్యుత్ సరఫరాను మెరుగుపరచడానికి కృత్రిమ మేధస్సును వినియోగిస్తోంది. విద్యుత్ సరఫరా, స్తంభాల లోపాలు, డిమాండ్ అంచనా వంటి కార్యకలాపాల్లో ఏపీఈపీడీసీఎల్ ఇప్పటికే ఏఐని ఉపయోగిస్తోంది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి, క్షేత్రస్థాయి సమస్యలను కనిపెట్టడానికి కూడా ఈ సాంకేతికతను ఉపయోగిస్తోంది.

ఏఐతో క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం

కొద్ది నెలలుగా ఏపీఈపీడీసీఎల్ తమ ఫ్రంట్‌లైన్ కార్యకలాపాల్లో ఏఐని ఉపయోగించి అద్భుతమైన ఫలితాలను సాధించింది. విద్యుత్ వ్యవస్థకు ఏఐ సాంకేతికతను అనుసంధానించడం వల్ల సమస్యల పరిష్కారం మరింత సులభమైంది. ఈ కొత్త వ్యవస్థను ఏపీఈపీడీసీఎల్ ఐటీ ఇంజినీర్లు, ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు, బెంగళూరుకు చెందిన జోనాయిక్ అనే స్టార్టప్ సంస్థ సంయుక్తంగా రూపొందించాయి. ఈ ఏడాది మార్చిలో ఏపీఈపీడీసీఎల్ డేటా సెంటర్‌లో ఒక ఏఐ సర్వర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సర్వర్‌ను స్మార్ట్‌ఫోన్‌కు అనుసంధానించి, విద్యుత్ సరఫరాలో లోపాలను సరికొత్త సాంకేతికతతో పరిష్కరించే ప్రయోగాల్లో విజయం సాధించారు.

స్మార్ట్‌ఫోన్ కెమెరాతో స్తంభాల లోపాలు కూడా

జోనాయిక్ స్టార్టప్ సంస్థ సీఈవో శశాంక్ చిలంకుర్తి మార్గదర్శకత్వంలో విద్యార్థులు జీపీయూ ప్రోగ్రామింగ్, ఏఐ వర్క్‌ఫ్లో ఫ్రేమ్‌వర్క్‌పై శిక్షణ పొందారు. అలాగే, ఏపీఈపీడీసీఎల్ ఐటీ టీమ్‌ను కూడా వాన్ శ్రీనివాస్ సుశిక్షితుల్ని చేశారు. విద్యుత్ సరఫరాలో ఎక్కడ ఏ సమస్య తలెత్తిందో లైన్‌మెన్ల సహకారంతో ఏఐ ద్వారా గుర్తించడంలో 100 శాతం విజయం సాధించారు. పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, గ్రిడ్స్ వద్ద ఎక్కడైనా లోపం ఉంటే, స్మార్ట్‌ఫోన్ కెమెరా ఉపయోగించి క్షణాల్లో కనిపెట్టే వ్యవస్థను రూపొందించారు. ఇన్సులేటర్లకు చెట్ల కొమ్మలు అడ్డుగా ఉన్నా వెంటనే ఏఐ ద్వారా సమాచారం తెలుసుకోవచ్చు. ఈ స్టార్టప్ సంస్థ, ఏపీఈపీడీసీఎల్ కోసం ఒక ప్రైవేట్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్ కోడ్‌ను రూపొందిస్తోంది. దీని ద్వారా విద్యుత్ సరఫరాలో లోపాలను ముందుగానే అంచనా వేసి, సంబంధిత ఆపరేటర్లకు సమాచారం చేరవేస్తుంది. ఈ వ్యవస్థ వల్ల సరఫరాలో లోపాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.

మీటర్ల లోపాలను కూడా పసిగట్టే ఏఐ

స్మార్ట్ మీటర్ల డేటాను అంచనా వేయడానికి కూడా ఏఐని ఉపయోగిస్తున్నారు. ఈ డేటా సహాయంతో తప్పుడు రీడింగ్‌లు నమోదు చేస్తున్న మీటర్లను సులభంగా పసిగట్టవచ్చు. దీనివల్ల ఏపీఈపీడీసీఎల్‌కు కలిగే ఆదాయ నష్టాన్ని తగ్గించగలుగుతున్నారు. అంతేకాకుండా, ఏఏ ప్రాంతాల్లో లో-వోల్టేజ్ సమస్యలు ఉన్నాయో ఏఐ రియల్-టైమ్ మానిటరింగ్, గ్రాఫ్ విశ్లేషణల ద్వారా సమాచారాన్ని అందిస్తోంది.

ఈ వ్యవస్థను సైబర్ దాడుల నుంచి రక్షించడానికి పటిష్టమైన యాంటీవైరస్ వ్యవస్థను కూడా రూపొందించారు. స్మార్ట్ మీటర్లు, ఫీడర్ నిర్వహణ, విద్యుత్ పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి సేకరించిన డేటాను ఏకీకృత డేటా లేక్ వ్యవస్థలో నిక్షిప్తం చేస్తున్నారు. ఇది ఓవర్‌లోడ్‌లను ముందుగానే గుర్తించడాన్ని మరింత సులభతరం చేసింది.

పోల్ నుంచి.. డిమాండ్ సరఫరా వరకూ..



రాష్ట్ర స్థాయిలో దీర్ఘకాలిక డిమాండ్ అంచనా, సామర్థ్య ప్రణాళికల కోసం ఇప్పటికే ఈపీడీసీఎల్ పరిధిలో ఏఐని విజయవంతంగా అమలు చేస్తున్నాం. భవిష్యత్తు విద్యుత్ కొనుగోళ్ల ప్రణాళిక, ఖర్చుల్ని ఆప్టిమైజ్ చేయగలుగుతున్నాం. స్మార్ట్‌మీటర్ ఇంటిగ్రేషన్‌తో ఇప్పుడు ఫీడర్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ స్థాయిలో స్థానికంగా డిమాండ్ అంచనాల్ని కూడా కనుగొనే సాంకేతికతని అందిపుచ్చుకున్నాం. ఓవర్‌లోడ్‌ని ముందుగానే గుర్తించడం, సకాలంలో లోడ్ షిఫ్టింగ్ మొదలైన అంశాలపై మరింత చురుగ్గా వ్యవహరించేలా ఈపీడీసీఎల్ నిరంతరం సేవలందించేందుకు సిద్ధమైంది. ఏఐ వినియోగం ద్వారా విద్యుత్ సరఫరాలో నాణ్యత పెరగడంతో పాటు.. సిబ్బందికి.. లోపాలు పరిష్కరించే మార్గాలు మరింత సులువవుతుండటం శుభపరిణామం.

– పృథ్వీతేజ్ ఇమ్మడి, ఈపీడీసీఎల్ సీఎండీ

నేటి నుంచి కనకమహాలక్ష్మి ఆలయంలో దసరా ఉత్సవాలు



డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నేటి నుంచి వచ్చే నెల 2 వరకు దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. 22న కనకమహాలక్ష్మి స్వర్ణకవచ కిరీటధారిణిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆ రోజున అమ్మవారికి సువర్ణ పుష్పార్చన, సహస్రనామార్చన జరపనున్నారు. 23న ఆదిలక్ష్మిగా దర్శనమిస్తారు. ఆ రోజు విశేష అర్చన, లక్ష కుంకుమార్చన జరుపుతారు. **24న ధనలక్ష్మి** అవతారంలో భక్తులను అనుగ్ర**హిస్తారు. ఆ రోజు** అమ్మవారికి లక్ష చామంతులతో **పూజ, 25న ధాన్య** లక్ష్మి అవతారంలో లడ్డూల పూజ **అందుకుంటారు.** 26న ధైర్యలక్ష్మి అవతారంలో తు**లసీదళాలతో సహ**స్రనామార్చన నిర్వహించనున్నా**రు. 27న సంతాన** లక్ష్మి అవతారంలో కలువపూల**తో పూజలందుకుం**టారు. 28న విజయలక్ష్మిగా గు**లాబీల పూజలందు**కుంటారు. 29న మూలానక్ష**త్రం సందర్భంగా** విద్యాలక్ష్మిగా దర్శనమివ్వనున్నా**రు. 30న గజలక్ష్మి** అలంకరణలో లక్ష గాజుల**తో పూజలందుకుం**టారు. అక్టోబర్ 1న మహాలక్ష్మి**గా శాకంబరి అలం**కరణలో పూజలందుకుంటారు. **నవరాత్రుల చివరి** రోజు అక్టోబర్ 2న స్వర్ణ కవ**చాలంకృత కనకమ**హాలక్ష్మి అమ్మవారికి 108 పుష్పాలతో స్వర్ణపుష్పార్చన నిర్వహించనున్నారు.

ఈదురుగాలులతో కకావికలం



గొటివాడలో టేకు చెట్టు మీద పడటంతో మృతి చెందిన పాడి ఆవు

సబ్బవరం: మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసి పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. లగిశెట్టిపాలెం ఎస్సీ కాలనీ వద్ద విద్యుత్ లైన్లపై వేపచెట్టు కూలడంతో మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. సబ్బవరం–చోడవరం రోడ్డులోని గొటివాడ సమీపంలో మడక సూర్యనారాయణ పశువుల పాకపై టేకు చెట్టు పడి పాడి ఆవు మృతి చెందింది. మృతి చెందిన పాడి ఆవుపై పడిన టేకు చెట్టును జేసీబీ సాయంతో తొలగించారు. సుమారు రూ.1 లక్ష విలువ చేసే ఆవు మృతి చెందడంతో రైతు సూర్యనారాయణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మరో చెట్టు విద్యుత్ లైన్లపై కూలడంతో రెండు విద్యుత్ స్తంభాలు విరిగి పోయినట్లు ఈపీడీసీఎల్ ఏఈ వీరేంద్ర తెలిపారు. దెబ్బ తిన్న విద్యుత్ లైన్లను సిబ్బంది రాత్రికి రాత్రి పునరుద్ధరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

5వ రోజు 717 బడ్డీలు, దుకాణాల తొలగింపు

(Iవ పేజీ తరువాయి)

వరకు 8, రైల్వే న్యూకాలనీ నుంచి దొండపర్తి జంక్షన్ వరకు 24, దొండపర్తి జంక్షన్ నుంచి అక్కయ్యపాలెం జంక్షన్ వరకు 25

జోన్–6: గాజువాక పోలీస్ స్టేషన్ నుంచి ఆటోనగర్ జంక్షన్ వరకు 60, వడ్లపూడి మెయిన్‌రోడ్డు, జాతీయ రహదారి 16 నుంచి గాంధీ విగ్రహం, కాళింగవీధి వరకు 79, వడ్లపూడి మార్కెట్ రోడ్డు నుంచి ముస్తాఫా జంక్షన్ కూర్మన్నపాలెం రోడ్డు వరకు 14, వంటిల్లు జంక్షన్ నుంచి పాత గాజువాక జంక్షన్ వరకు 116 దుకాణాలు, బడ్డీలు తొలగించారు.

జోన్–7: నెహ్రూ చౌక్ నుంచి శారదా నది వరకు 45, నెహ్రూ చౌక్ నుంచి గుండాల జంక్షన్ వరకు 18

జోన్–8: నాయుడుతోట జంక్షన్ నుంచి వేపగుంట జంక్షన్ వరకు 30, తొలిపావంచ నుంచి అడవివరం వరకు 61, ప్రహ్లాదపురం నుంచి గోశాల జంక్షన్ వరకు 23 దుకాణాలు, బడ్డీలు తొలగించారు.

● ఉదయం ఎండ.. మధ్యాహ్నం భారీ వాన



నగరంలో ఆదివారం విచిత్ర వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండ, ఉక్కబోతతో నగరవాసులు ఇబ్బంది పడ్డారు. ఆ తర్వాత ఆకాశం మబ్బులు పట్టి పలు చోట్ల కుండపోత వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తన ద్రోణి ఏర్పడిందని, దీంతో వాతావరణంలో ఆకస్మిక మార్పుల కారణంగా వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు విశాఖ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తాజా వర్షానికి ఉపరితల ద్రోణి ప్రభావమే కారణమన్నారు.

– ఆరిలోవ/ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్







వైఎస్సార్‌సీపీ జెండా తొలగింపుతో
ఉద్రిక్తత





జెండా రాడ్‌ను విక్రయానికి తీసుకువెళ్తున్న పొక్లెయిన్



ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద పోలీసులు, జీవీఎంసీ సిబ్బందితో వైఎస్సార్‌సీపీ నాయకుల వాగ్వాదం



ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద వైఎస్సార్ విగ్రహం పక్కన జీవీఎంసీ సిబ్బంది తొలగించిన పార్టీ జెండా

- 13వ వార్డు టీడీపీ నాయకుల మౌఖిక ఆదేశాలతో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ బరితెగింపు
- వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఆందోళనతో తిరిగి పార్టీ జెండా ఏర్పాటు

ఆరిలోవ: స్థానిక టీడీపీ నేతల మౌఖిక ఆదేశాలకు జీవీఎంసీ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ అత్యుత్సాహం తోడవడంతో ఆరిలోవ ప్రాంతంలో ఆదివారం ఉద్రిక్తత నెలకొంది. ఎవరికీ అడ్డంకి లేకుండా, ఐదేళ్లుగా ఉన్న వైఎస్సార్‌సీపీ జెండాను జీవీఎంసీ సిబ్బంది ఆదివారం తొలగించారు. దీంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆందోళనకు దిగారు. 13వ వార్డు పరిధి ఆరిలోవ ఆఖరు బస్టాప్ వద్ద ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి..

ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం పక్కనే ఏ వాహనాలకు ఎలాంటి ఆటంకం లేకుండా 2019లో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. వార్డు టీడీపీ నాయకుల కనుసైగలతో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్(బీఐ) మహేష్ రోడ్డు పక్కన బడ్డీల తొలగింపు ఆదేశాలను పక్కన పెట్టి వైఎస్సార్‌సీపీ జెండాను దిమ్మతో సహా పొక్లెయిన్‌తో తొలగించి ముక్కలు చేయించేశారు. అక్కడితో ఆగకుండా ఆ జెండా కర్ర(ఇనుప రాడ్డు)ను పొక్లెయిన్ తొట్టెలో వేసుకుని సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న స్క్రాప్ దుకాణంలో కిలోల లెక్కన విక్రయించేశారు. విషయం తెలుసుకున్న వార్డులోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తూ జీవీఎంసీ సిబ్బంది విక్రయించిన స్క్రాప్ దుకాణం వద్దకు చేరుకున్నారు. అక్కడ సిబ్బందిని నిలదీయడంతో వెంటనే ఆ జెండా కర్రను అదే పొక్లెయిన్‌లో వేసుకుని తిరిగి తొలగించిన స్థానం వద్దకు తీసుకొచ్చారు.

ఇంతలో వైఎస్సార్ విగ్రహం వద్దకు అధిక సంఖ్యలో కార్యకర్తలు చేరుకుని కూటమి ప్రభుత్వం, జీవీఎంసీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పొక్లెయిన్ డ్రైవర్, జీవీఎంసీ సిబ్బందిని నిలదీశారు. దీంతో బీఐ మహేష్ చెప్పడం వల్లే తొలగించినట్లు డ్రైవర్ చెప్పారు. ఈ నేపథ్యంలో అక్కడకు చేరుకున్న మహేష్ తొలుత తనకేమీ తెలియదంటూ తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఈలోగా ఆరిలోవ ఎస్‌ఐ రాందాస్ సిబ్బందితో చేరుకుని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వారించారు. బీఐ మహేష్‌ను ఎస్‌ఐ ప్రశ్నించడంతో టీడీపీ నాయకుల పేరు చెబితే తనకు ఇబ్బంది అవుతుందని, పార్టీ జెండా తొలగించడం తన తప్పేనంటూ ఒప్పుకున్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు శాంతించారు. అనంతరం అక్కడ గొయ్యి తీయించి జెండా ఏర్పాటు చేయించారు. దీనిపై కొంత సేపు నిరసన తెలిపిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పాలతో అభిషేకం చేశారు. ఇదిలా ఉండగా ఈ చర్యను పార్టీలకు అతీతంగా పలువురు ఖండించారు.

ఈ ఆందోళనలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్, రాష్ట్ర చేనేత విభాగం జనరల్ సెక్రటరీ వానపల్లి ఈశ్వరరావు, నాయకులు బేత దుర్గారావు, కాకర గోవింద్, వంకర బాబూరావు, ప్రసంగి వాసు, పాండ్రంకి శ్రీనివాసరావు, బేగం, పోలారావు, బొండా ఉమామహేష్, డాక్టర్ నాయుడు, వానపల్లి మంగరాజు, బంగార్రాజు, భాస్కర్, కామేశ్వరరావు, రాము, సురేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రగతిలో.. డా.బీఎన్ సింగ్‌ది సువర్ణాధ్యాయం

- లక్నోలో మరణించిన పూర్వ సీఎండీ డాక్టర్ బీఎన్ సింగ్
- స్టీల్ ప్లాంట్‌ను ఆర్థిక నష్టాల నుంచి గట్టెక్కించిన ఘనత



ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు స్ఫూర్తి ప్రదాత, ఆర్థిక నష్టాల్లో ఉన్న ప్లాంట్‌ను లాభాల బాట పట్టించిన మేధావి, మాజీ సీఎండీ డాక్టర్ బీఎన్ సింగ్ ఆదివారం లక్నోలో కన్నుమూశారు. 'నా ఉద్యోగులే నా బలం'అని చాటి చెప్పి స్టీల్‌ప్లాంట్ పునరుజ్జీవానికి మార్గదర్శకులైన ఆయన మరణ వార్త స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు తీవ్ర విషాదాన్ని కలిగించింది.

రూ.4 వేల కోట్ల నష్టాల నుంచి..

1997 నవంబర్ 28న బీఎన్ సింగ్ స్టీల్‌ప్లాంట్ సీఎండీగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటికి సంస్థ రూ.4 వేల కోట్ల నష్టాలతో, సిక్ ఇండస్ట్రీగా ప్రకటించి, బోర్డ్ ఫర్ ఇండస్ట్రియల్ అండ్ ఫైనాన్షియల్ రీకన్‌స్ట్రక్షన్(బీఐఎఫ్‌ఆర్)కు రిఫర్ చేయబడింది. కంపెనీ ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయిన పరిస్థితులు. అసాధారణ మెటలర్జిస్ట్, టెక్నోక్రాట్ మాత్రమే కాకుండా కార్మికుల పట్ల మానవీయ దృక్పథం కలిగిన నాయకుడాయన. 'టెక్నాలజీ ఒక ప్లాంట్‌ను నిర్మిస్తుంది.. కానీ దాన్ని లాభాల్లో నడిపేది మనుషులే'అని ఎప్పుడూ చెప్పేవారు. ఆనాడు సంస్థ నష్టాలకు వెరవకుండా స్టీల్‌ప్లాంట్ శ్రామిక శక్తిని సమీకరించారు. అప్పటి 16 వేల మంది సిబ్బందిని 'వుయ్ కెన్'అంటూ ఉత్తేజపరిచారు. 2002 నాటికి లాభాల బాట పట్టించారు. తరచూ ఉత్పత్తి విభాగాలను సందర్శిస్తూ, అక్కడి ఉద్యోగులతో నేరుగా మమేకమవుతూ వారితో సన్నిహితంగా ఉండేవారు. ఉక్కునగరంలోని సీఎండీ బంగ్లాలో పండే మామిడి పండ్లను ఉద్యోగులతో పంచుకునేవారంటే.. ఆయనకు ఉద్యోగుల పట్ల ఉన్న దృక్పథం ఏంటో తెలుసుకోవచ్చు.



2000లో నాటి కేంద్ర ఉక్కు మంత్రి దిలీప్‌రే తో డాక్టర్ బీఎన్ సింగ్

అందరినీ ఏకతాటిపైకి తెచ్చి..

యూనియన్లు, అధికారులు, కార్మికులు, యాజమాన్యం కలిసి కట్టుగా పనిచేసేలా సంఘటితం చేసిన వ్యక్తిగా బీఎన్ సింగ్‌ను చెప్పుకోవచ్చు. క్లిష్టమైన ఆర్థిక సవాళ్లను అధిగమించి, 2002 నాటికి సంస్థను లాభాల్లోకి తీసుకురావడం వెనుక ఆయన నాయకత్వ పటిమే కారణమని చెప్పడం అతిశయోక్తి కాదు. తీవ్రమైన ఆర్థిక పరిస్థితుల్లో కూడా ఉద్యోగుల హక్కులు, సంక్షేమం ఆలస్యం కాకుండా చూసుకున్న నిజమైన మానవతావాదిగా ఆయన్ని ఉద్యోగులు, కార్మికులు చెప్పుకుంటారు. స్టీల్‌ప్లాంట్ కోసం ఆయన చేసిన సేవల్ని గుర్తించి, ఆయన గౌరవార్థం ఆంధ్ర విశ్వవిద్యాలయం మెటలర్జికల్ ఇంజినీరింగ్‌లో ఆయన పేరిట గోల్డ్ మెడల్‌ను అందిస్తున్నారు. ఆధ్యాత్మికవేత్త కూడా అయిన డాక్టర్ బిఎన్ సింగ్ టువార్డ్స్ ది క్రియేటర్, లైఫ్ ఏ జర్నీ, రిలిజియన్ సైన్స్ అండ్ సొసైటీ అనే వైజ్ఞానికతతో కూడిన ఆధ్యాత్మిక పుస్తకాలను రచించారు. ఆయన మృతి పట్ల స్టీల్‌ప్లాంట్ అధికార, కార్మిక సంఘాలు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

పేద విద్యార్థులకు 'ఎల్ ఏంజెల్స్' స్కాలర్‌షిప్‌లు



స్కాలర్‌షిప్స్, బహుమతులతో విద్యార్థులు, జపాన్ ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: జిల్లాలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభావంతులైన 30 మంది పేద విద్యార్థులకు జపాన్‌కు చెందిన ఎల్ ఏంజెల్స్ ఇంటర్నేషనల్ వలంటీర్స్ అసోసియేషన్ రూ.3.60 లక్షల విలువైన స్కాలర్‌షిప్‌లు అందించింది. రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ సహకారంతో నగరంలోని ఓ హోటల్లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ఎల్ ఏంజెల్స్ ప్రతినిధులు హాజరై, స్కాలర్‌షిప్‌లు అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు యోషి నగౌర మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. తమ అసోసియేషన్ ద్వారా ఏటా ఈ సాయాన్ని కొనసాగిస్తామన్నారు. క్లబ్ పూర్వ అధ్యక్షుడు, ఎల్ ఏంజెల్స్ సమన్వయకర్త మండ జానకిరామ్ మాట్లాడుతూ ప్రతిభ గల పేద విద్యార్థులకు సహాయం అందించాలనే సదుద్దేశంతో ఏటా సహకరిస్తున్న అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ తరఫున అందిస్తున్న వివిధ సేవలను వివరించారు. రోటరీ పూర్వ గవర్నర్ ఎంసీ దాస్ మాట్లాడుతూ ఎల్ ఏంజెల్స్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ అధ్యక్షుడు పిల్లల మర్రి రఘు, కార్యదర్శి బీఎస్ఎన్ బెనర్జీ, కోశాధికారి వి.పాండురంగరాజు, హనుమంతరావు, పూర్వ అధ్యక్షుడు బి.బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షిలో ఫెస్టివల్ డిస్కౌంట్ సేల్



లేపాక్షిలో ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు ఫెస్టివల్

డాబాగార్డెన్స్: ఏపీ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఎం.విశ్వ ఆదేశాల మేరకు నగరంలోని లేపాక్షి షోరూంలలో ఫెస్టివల్ డిస్కౌంట్ సేల్ నిర్వహించనున్నట్లు లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియం విశాఖ శాఖ మేనేజర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ డిస్కౌంట్ సేల్ అక్టోబర్ 2 వరకు ఉంటుందన్నారు. హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్‌పై 10 శాతం, అన్ని హ్యాండీక్రాఫ్ట్స్‌పై 15 శాతం తగ్గింపు, ముత్యాలు, ఆభరణాలు, గంధపు చెక్క, అగరుబత్తి, ధూపం, రుద్రాక్ష, పూజా వస్తువులపై 10–15 శాతం, ఎంపిక చేసిన కొన్ని క్రాఫ్ట్స్‌పై 20 శాతం ప్రత్యేక ప్రమోషనల్ డిస్కౌంట్ అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

అందుబాటులో ఉన్న క్రాఫ్ట్స్

ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, వుడ్ కార్వింగ్స్, కలంకారి చీరలు, బెడ్‌షీట్స్, వరంగల్ పత్తి దుర్రీలు, రాగి విగ్రహాలు, లోహ కళాఖండాలు, జైపూర్ వుడ్ ఆర్టికల్స్, మార్బుల్ అండ్ రాతి శిల్పాలు, సాంప్రదాయ చిత్రాలు, మట్టి, పేపర్ మాషీ విగ్రహాలు తదితర క్రాఫ్ట్స్ అందుబాటులో ఉన్నాయి. విశాఖ నగర ప్రజలు లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియంను సందర్శించి, శిల్పకారులను ప్రోత్సహిస్తూ, అసలైన రత్నాలను ఇంటికి తీసుకెళ్లాలని కోరారు. ఈ ఫెస్టివల్ డిస్కౌంట్ సేల్ నగరంలోని జగదాంబ జంక్షన్, రామ్‌నగర్ వీఎంఆర్‌డీఏ షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు విశాఖ ఎయిర్‌పోర్టు షోరూంలలో ఉంటుందన్నారు.

ఐ ఫోన్ కొనలేదని యువకుడి ఆత్మహత్య



సాయిమారుతి కెవిన్(ఫైల్)

పెందుర్తి: తల్లిదండ్రులు ఐ ఫోన్ కొనలేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుజాతనగర్‌లో ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. సుజాతనగర్‌లో నివాసం ఉంటున్న చంద్రశేఖర్ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతున్నాడు. అతని కుమారుడు సాయి మారుతి కెవిన్(26) కొంతకాలం హైదరాబాద్‌లో సినిమా పరిశ్రమలో పని చేసి ఇటీవలే ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో తనకు ఐ ఫోన్ కావాలని తండ్రిని సాయి అడుగుతున్నాడు. ఆదివారం కూడా ఈ విషయంపై తండ్రీ కొడుకుల మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. అనంతరం తన గదిలోకి వెళ్లిన కెవిన్ సాయంత్రమైనా బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు తలుపును బలవంతంగా తెరడంతో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. హతాశులైన తల్లిదండ్రులు అతడ్ని కిందకు దించినా అప్పటికే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని కెవిన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ స్వామినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువత డ్రగ్స్ బారిన పడొద్దు



ర్యాలీలో పాల్గొన్న ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్

ఏయూ క్యాంపస్: యువతరం డ్రగ్స్‌కు బానిసలు కాకుండా, డ్రగ్స్ రహిత దేశంగా నిలిపే దిశగా కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆకాంక్షించారు. దేశ వ్యాప్తంగా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న నమో యువ 3కే రన్ బీచ్‌రోడ్డులో భారతీయ యువ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కాళీమాత ఆలయం వద్ద రన్‌ని ప్రారంభిస్తూ మాధవ్ మాట్లాడారు. గంజాయి. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని హితవు పలికారు. 2047 నాటికి ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా భారత్ నిలుస్తుందని, ఈ బాధ్యత యువతపై ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ సంస్థలకు భారతీయులే అధిపతులుగా నిలచారని, వారిని ఆదర్శంగా తీసుకుని యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఈ రోజు నిర్వహించిన ఈ పరుగు దేశాభివృద్ధి దిశగా యువతను తీసుకెళ్లాలా ఉండాలన్నారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర మోహన్, కోశాధికారి నాగేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుష్, మీడియా ఇన్‌చార్జి కోటేశ్వరరావు, యువమోర్చా నాయకులు ధోని నాగరాజు, వంశీ యాదవ్, కొండా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్లోబల్ గోల్స్ రన్



రన్‌లో పాల్గొన్న యువత

ఏయూ క్యాంపస్: బీచ్‌రోడ్డు వేదికగా ఐసెక్ విశాఖ చాప్టర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం గ్లోబల్ గోల్స్ రన్ 2025 నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, నగరవాసులు, స్వచ్ఛంద సంస్థలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, ఆ దిశగా ప్రజలను నడిపించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కార్యక్రమ నిర్వాహకులు జ్ఞానశ్రీ బోకం తెలిపారు. ఏఐఈఎస్ఈసీ ఉపాధ్యక్షుడు సమీర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు యువతలో బాధ్యతను పెంపొందిస్తాయన్నారు. నిర్వాహకులు సార్థక్ మాట్లాడుతూ యువతలో నాయకత్వం పెంచడానికి ఈ కార్యక్రమం దోహదకారిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసెక్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలలకు దసరా సెలవులు

ఆరిలోవ: రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలు ప్రకారం జిల్లాలో పాఠశాలలకు సోమవారం నుంచి అక్టోబర్ 2 వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు డీఈవో ఎన్.ప్రేమ కుమార్ తెలిపారు. జిల్లాలో అన్ని యాజమాన్యాల పాఠశాలలకు ఈ సెలవులు వర్తిస్తాయన్నారు. అక్టోబర్ 3న తిరిగి పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ బస్సు యాత్ర



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు తదితరులు

అల్లిపురం: రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 14 నుంచి నవంబర్ 14 వరకు శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు నెల రోజుల పాటు బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు ఏఐఎస్ఎఫ్ (ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్) జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు తెలిపారు. ఆదివారం అల్లిపురం సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. నాగరాజు మాట్లాడుతూ, మెడికల్ కళాశాలలను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న రూ. 6400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 3400కు పైగా ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని, ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం బస్సు యాత్రతో పాటు వివిధ రూపాలలో కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి. శేఖర్, కోశాధికారి భవాని, సహాయ కార్యదర్శిలు కె.మౌనిక, హేమానందం, ఉపాధ్యక్షుడు కిరణ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సాగరతీరంలో సందర్శకుల సందడి

కొమ్మాది: పర్యాటక ప్రాంతాల్లో ఆదివారం సందడి నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యాటకుల తాకిడి కనిపించింది. గుడ్లవానిపాలెం బీచ్, సాగర్‌నగర్ బీచ్, రుషికొండ బీచ్, తొట్లకొండ బీచ్, రామానాయుడు ఫిల్మ్ స్టూడియో, ఎర్రమట్టి దిబ్బలు, భీమిలి బీచ్ ప్రాంతాల్లో సందర్శకులు ఉల్లాసంగా గడిపారు. ఆదివారం సెలవు కావడంతో బీచ్ రోడ్డు వెంబడి ఉన్న ఆధ్యాత్మిక కేంద్రాలైన మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయం, టీటీడీ వేంకటేశ్వరస్వామి ఆలయం, ఇస్కాన్ టెంపుల్, హంసవన పుణ్యక్షేత్రం రామాద్రిలో భక్తుల తాకిడి పెరిగింది.



రుషికొండ బీచ్‌లో పర్యాటకులు

వరి పొలంలో మృతదేహం లభ్యం



ముత్యాల నాయుడు(ఫైల్)

పద్మనాభం: మండలంలోని విలాస్కాన్‌పాలేనికి చెందిన బోని ముత్యాలనాయుడు(68) ఆదివారం పొలంలో శవమై కనిపించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. తన తండ్రి ముత్యాలనాయుడు పొలంలోకి వెళ్లి తిరిగి రాలేదని ఈ నెల 18న కుమారుడు నరేష్ పద్మనాభం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు ముత్యాలనాయుడు అదృశ్యమైనట్టు కేసు నమోదుచేశారు. ముత్యాలనాయుడు తమ వరి పైరు పొలంలోనే బోర్లాపడి మృతిచెంది ఉన్నాడు. పొలంలో ముత్యాలనాయుడు మృతదేహాన్ని అదే గ్రామానికి చెందిన కాళ్ల శ్రీనివాసరావు ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో చూశాడు. ఈ విషయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు తెలిపాడు. తన తండ్రి గుండెపోటుతో మృతి చెంది ఉండొచ్చని కుమారుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ముత్యాలనాయుడు మృతదేహం బాగా కుళ్లిపోవడంతో భీమునిపట్నం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు సంఘటన స్థలానికి వచ్చి, నమూనాలు సేకరించినట్లు పోలీసులు పేర్కొన్నారు.